క్లుప్తంగా

నేడు కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు ముందస్తు పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి వీఎంసీ ఏర్పాట్లు చేసిందని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు దినమైనా పన్ను చెల్లింపులకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో13 క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంటి పన్ను , ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీపై 50శాతం రాయితీని పొందవచ్చని, 2025 –26 సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లిస్తే 5 శాతం రాయితీని పొందవచ్చని తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై శనివారం నగరానికి చెందిన శ్రీదుర్గా భవానీ నృత్య కళానిలయానికి చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పావని ప్రియాంక పర్యవేక్షణలో 22 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సొరంగ మార్గంలో బైక్ దగ్ధం



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగ మార్గంగుండా వెళుతున్న వ్యక్తి ద్విచక్ర వాహనం తగులబడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం దారపు రాంబాబు అనే వ్యక్తి చిట్టినగర్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకుని సొరంగంలో నుంచి విద్యాధరపురం వైపు వస్తున్నాడు. పక్క నుంచి వస్తున్న వాహనదారుడు మీ బైక్ తగులపడుతుందని చెప్పగానే బైక్ నడుపుతున్న వ్యక్తి దానిని వదిలేసి పక్కకు జంప్ అయ్యాడు. దాంతో స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోవడంతొ వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది. కాగా వాహనదారుడికి త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా సుదర్శన యాగం



విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠ శ్రీ వెంకటేశ్వర శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జగద్గురువులు విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదేశంతో వైభంగా రుత్వికులు సుదర్శన యాగం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, ద్వాదశ ప్రదక్షణ, సాయంత్రం ధ్వజావరోహణ, పవళింపు సేవ, మహా మంగళహారతి కనులపండువగా నిర్వహించారు. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షకులు డాక్టర్ సి.రామ్మోనరావు మాట్లాడుతూ స్వామి వారి ఆదేశంతో దేవాలయంలో అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

విద్యామందిర్ సేవలు అభినందనీయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యాబోధన చేస్తున్న శ్రీ భారతీయ విద్యామందిర్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీనగర్ కాలనీ శ్రీ భారతీయ విద్యామందిర్‌లో శనివారం దేశీయ సంప్రదాయ పద్ధతిలో వినూత్నంగా స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వివేకానందుని వస్త్ర, వేషధారణలతో ఆయన గుర్తుకు తెచ్చేరీతిలో స్నాతకోత్సవం నిర్వహించటం ప్రశంసనీయం అని కొనియాడారు. మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కరెస్పాండెంట్ దుర్గాప్రసాద్, పెనుమత్స అప్పలరాజు, చల్లా లక్ష్మీనారాయణ, భాస్కరరాజు, రాఘవరాజు, జేవీ షణత్ కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్నాతకోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న పర్యవేక్షించారు.

ప్రశ్నార్థకంగా పేదల బతుకులు

- శిథిలావస్థకు చేరిన కార్మిక శాఖ నిర్మించిన ఆరు బిల్డింగ్‌లు
- నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వైనం
- చెట్ల వేళ్లు లోనకి చొచ్చుకొచ్చి.. శ్లాబ్ పెచ్చులు రాలి..
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి
- పట్టించుకోని నగరపాలక సంస్థ, కార్మిక శాఖ అధికారులు



న్యూ లేబర్‌కాలనీలోని ఆరు బిల్డింగ్‌లు



శిథిల భవనంలోని శ్లాబ్ పెచ్చులూడి బయట పడిన ఐరన్ చువ్వలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవి ఆరు బిల్డింగు (బ్లాక్)లే. వాటిల్లో నివసించే వందలాది మంది బతుకులు మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. ఏ బిల్డింగ్ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు అన్ని బిల్డింగులు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి. కొన్ని బిల్డింగులపైన, గోడల మధ్య చెట్లు పెరిగి వాటి వేళ్లు విస్తరించి ఇళ్లల్లోకి చొచ్చుకొస్తున్నాయి. శిథిల భవనాల శ్లాబ్‌ల పెచ్చులు రాలి గదుల్లో పడుతున్నాయి. బిల్డింగ్‌పైన ఉన్న పిట్టగోడలు కూలిపోతున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం కార్మిక శాఖ నిర్మించిన ఆరు బిల్డింగుల్లో నివసిస్తున్నవారు రోజులు లెక్కపెట్టుకుంటూ ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు నామమాత్రపు అద్దె వసూలు చేస్తున్న కార్మిక శాఖ, మరో వైపు పన్నులు వసూలు చేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోక పోవడంతో వారి ప్రాణాలు గాలిలో దీపాల్లా మిణుకు మిణుకుమంటూ ఉన్నాయి. అప్పటి స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆరు బిల్డింగ్‌ల నివాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు విశేష కృషి చేసినా అనివార్య కారణాల వలన అది సాధ్యపడలేదు.

కార్మికుల ప్రయోజనార్థం ఆరు బిల్డింగ్‌లు.....

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే కార్మికుల కోసం పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని విద్యాధరపురం లేబర్‌కాలనీలో 1982లో న్యూ లేబర్‌కాలనీ (సెమీ ఇండిపెండెంట్ హౌసింగ్ స్కీమ్) పేరుతో నాలుగు దశాబ్దాల క్రితం కార్మిక శాఖ ఆరు బిల్డింగ్‌లు నిర్మించింది. ఒక్కో బిల్డింగ్ (బ్లాక్)లో ఎనిమిది చొప్పున 48 ఫ్లాట్లు ఉన్నాయి. వాటిల్లో ఎనిమిది ఫ్లాట్లలో మాత్రమే ఒరిజనల్ హోల్డర్స్ ఉంటుండగా, 32 ఫ్లాట్లలో ఒరిజినల్ హోల్డర్స్ వారసులు కొందరు, కొనుగోలు (చేతులు మారినవి) చేసినవారు మరి కొందరు, అద్దెకు ఉంటున్నవారు ఇంకొందరు ఉంటున్నారు. మరో ఎనిమిది ఖాళీగా ఉండగా కొందరు ఆక్రమించుకుని వాడుకుంటున్నారు. ఒక్కో ఫ్లాట్‌కు నామమాత్రపు అద్దె కింద కార్మిక శాఖ రూ.21.50 వసూలు చేసేది. ఇప్పటికికూడా నివాసితులు అదే అద్దె చెల్లిస్తున్నారు. అది కాకుండా నగరపాలక సంస్థ విధించే పన్ను షరా మామూలే. ఆ విధంగా ఆరు బిల్డింగ్‌లలో మొత్తం 40 మంది మాత్రమే పన్నులు, అద్దె చెల్లిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడు?



నలభై ఏళ్లకుపైగా ఆరు బిల్డింగ్‌లోని ఒక ఫ్లాట్‌లో నివసిస్తున్నాం. శిథిలమైపోయిన భవనంలో ఉంటున్నామే కానీ ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతుంది. పనులపై బయటకు వెళ్లినా పెచ్చులూడి పడిపోయే ఇల్లు, కుటుంబసభ్యుల గురించే ఆలోచన. వెలంపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ బాధలు చూడలేక పరిష్కారం కోసం కృషి చేసినా కొందరు అడ్డుపడటంతో ఆగిపోయింది. శిథిల భవనంలో నుంచి బయటపడేందుకు శాశ్వత పరిష్కారం ఎప్పుడా అని ఎదురు చూస్తున్నాం.

– వల్లం రవి కుమార్, కాలనీవాసి

పాలకులు న్యాయం చేయాలి



ఏళ్ల తరబడి కాలనీలోని ఆరు బిల్డింగ్‌ల్లో ఉంటున్నాం. తాగు నీటి సౌకర్యం లేని రోజుల నుంచి నేటి వరకు అలాగే కాలం వెళ్లదీస్తున్నాం. ఒక పక్క ముంపు బాధ మరో వైపు బిల్డింగ్ ఎప్పుడు కుప్పకూలిపోతుందోనన్న భయం నిద్ర లేకుండా చేస్తుంది. మా నాన్న సుబ్బారావు జీవించి ఉండగా ఆరు బిల్డింగ్‌ల దుస్థితి గురించి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగి వినతి పత్రాలు ఇచ్చేవారు. ఉన్నతాధికారులను సైతం కలిసి విజ్ఞప్తులు చేశారు. ఇంత వరకు అతీగతీ లేదు. పాలకులు ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

– చాగంటి సుధాకర్, కాలనీవాసి

ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు?

శిథిలమైపోయిన ఆరు బిల్డింగ్‌ల దుస్థితి అటు లేబర్ డిపార్ట్‌మెంట్, ఇటు మున్సిపల్ కార్పొరేషన్ దృష్టిలో కూడా ఉంది. అయినా ఎవరికి వారు నిమ్మకునీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారు తప్ప పరిష్కార మార్గం గురించి ఆలోచన చేస్తున్న దాఖలాలు లేవు. గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్నవారు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారు. అటువంటి వరద మరో సారి వస్తే శిథిల భవనాలు కుప్పకూలిపోతాయని నివాసితులు వాపోతున్నారు.



శిథిల భవనం గోడలో నుంచి మొలిచిన చెట్టు

దుర్గమ్మ సన్నిధిలో కమర్షియల్ క్లాప్!

- కొత్త సినిమాకు.. కళావేదిక
- దేవదాయ శాఖ అధికారుల తీరుపై విమర్శలు



కళావేదిక ఎదుట సినిమా సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కొత్త సినిమాను ప్రారంభించడం విమర్శలకు దారి తీసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కమర్షియల్ చిత్రానికి క్లాప్ కొట్టడంతో భక్తులు విస్తుపోయారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక ఇందుకు వేదికై ంది. ఆధ్యాత్మిక కేంద్రాలైన ఆలయ ప్రాంగణాల్లో సినిమా, రాజకీయ విషయాలను చర్చించడం, మాట్లాడటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం నిషేధం. కళావేదిక ఎదుట కొత్త సినిమాను ప్రారంభించుకునేందుకు అనుమతించడం ఎంతవరకు సబబని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

నేరుగా కమిషనర్ నుంచే అనుమతి

సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి సదరు నిర్వాహకులు నేరుగా దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నుంచి అనుమతి తీసుకోవడం కొసమెరుపు. మరో వైపు సదరు సినిమా ప్రారంభోత్సవానికి అవసరమైన సామగ్రిని మొత్తం లిఫ్టుల ద్వారానే కొండపైకి తరలించారు. శనివారం మధ్యాహ్నం భక్తుల రద్దీ అధికంగా ఉన్న తరుణంలో లిఫ్టులోకి భక్తులను అనుమతించకుండా సామగ్రిని కిందకు తరలించారు. ఈ వ్యవహారంపై కూడా భక్తుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. మరో వైపు సినిమాకు సంబంధించి వారందరికీ దేవస్థాన సిబ్బంది ప్రొటోకాల్ దర్శనాలు కల్పించడంతో పాటు ప్రసాదాలు, శేషవస్త్రాలను సైతం గమనార్హం. దీనిపై ఆలయ అధికారులను అడగ్గా, దేవదాయ శాఖ నుంచి అనుమతి తీసుకోవడమే కాకుండా దేవస్థానానికి రూ. 10 వేలు రుసుం చెల్లించినట్లు పేర్కొంటున్నారు.

స్టెల్లాలో పూర్వ విద్యార్థినుల సమావేశం



పటమట(విజయవాడతూర్పు): కళాశాలలో క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారని, ప్రతి విద్యార్థిని అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఏపీ హైకోర్టు ఏజీపీ ఓరుగంటి సాయమ్మ అన్నారు. శనివారం పటమట స్టెల్లా కళాశాలలో పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల పురోభివృద్ధికి ప్రత్యేక కోర్సులు అందిస్తూ, మంచి పౌరులుగా తీర్చి దిద్దుతోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, కరెస్పాండెంట్ లిన క్వాడ్రస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థినులు పలురంగాల్లో ఉన్నతస్థానాల్లో ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ సిస్టర్ ఇన్నసియమ్మ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, సిస్టర్ లావణ్య , స్టూడెంట్స్ డీన్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌లో జాతీయ సదస్సు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీ పరమేశ్వరరావు, డైరెక్టర్ ఎస్ కీర్తి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో వివిధ కళాశాలలు, పరిశ్రమల నుంచి పరిశోధనా పత్రాలు సమర్పించుటకు పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, సాంకేతిక నిపుణులు విచ్చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా నమీబియా దేశంలోని విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ కే వెంకటేశ్వర్లు, అమెరికా, ఓమన్ దేవాల నుంచి పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారని పేర్కొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ వాసవి

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కమిషనరేట్ పరిధిలోని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, సంయుక్త ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రాఫిట్ జూ కంపెనీ సహకారంతో శనివారం విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం (జువెనైల్ హోమ్)లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ వాసవి మాట్లాడుతూ బాలల రక్షణకు ప్రతిఒక్కరూ స్పందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, దాడులు చేస్తే పోక్సో చట్టంలో కఠిన శిక్షలు ఉంటాయని చెబుతూ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. జువెనైల్ హోమ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాలలను రక్షించడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ జీవన్‌కుమార్, జువెనైల్ వెల్ఫేర్ అధికారి రామ్ మనోహర్, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్, జువెనైల్ హోమ్ ఐపీఓ బేగ్, ఎన్టీఆర్ జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జొన్నలగడ్డ ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యం!

- అర్ధరాత్రి మద్యం తాగి అడ్డదారిలో కొండెక్కిన యువకుడు
- మందలించి వదిలేసిన భద్రతా సిబ్బంది
- చోరీకి రెక్కీ అనే అనుమానాలు
- ఆలయ అధికారులకు కనీస సమాచారం లేదు



యువకుడు కొండపైకి చేరిన ప్రాంతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యం మరోసారి కనిపించింది. అర్ధరాత్రి మద్యం తాగిన ఓ యువకుడు అడ్డదారిలో మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకోగా, అతన్ని పట్టుకున్న గుర్ఖా, సెక్యూరిటీ గార్డులు సదరు వ్యక్తిని మందలించి వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆలయంలో చోరీకి పాల్పడేందుకు ముందుగా రెక్కీ నిర్వహించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం శుక్రవారం అర్ధరాత్రి సమయంలో జరగగా, శనివారం మధ్యాహ్నం వరకు ఆలయ ఏఈవోలు, సూపరిండెంటెంట్ స్థాయి అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో భద్రతా వ్యవహారాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కల్యాణం తర్వాత..

దుర్గగుడిలో చైత్రమాస బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం జరిగింది. అర్ధరాత్రి అధికారులు, అర్చకులు పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్ద ఉన్న ఉత్సవమూర్తుల వద్ద ఓ హోంగార్డును, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిని బందోబస్తుగా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఓ గూర్ఖా రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు.

అర్ధరాత్రి 1.30 గంటలకు

అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత మల్లేశ్వరాలయం దక్షిణం వైపున ఉన్న కొండ ప్రాంతం నుంచి మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు పైకి చేరుకున్నాడు. అయితే అక్కడే ఉన్న గుర్ఖా ఆ యువకుడిని పట్టుకుని ఆరా తీయగా, భోజనాలు పెడుతున్నారని వచ్చానంటూ బుకాయించాడు. అర్ధరాత్రి కొండపై ఎందుకు భోజనాలు పెడతారని సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు గానీ ఆరా తీయలేదు. కొంత సమయం తర్వాత ఆ యువకుడిని మందలించి వదిలివేయడంతో అతను అక్కడి చల్లగా జారుకున్నాడు.

అధికారుల దృష్టికి రాని వైనం

భద్రతా సిబ్బంది ఈ అంశంపై దేవస్థాన అధికారులకు తెలియజేయలేదు. మధ్యాహ్నం మహానివేదన సమయంలో ఈ విషయం బయటకు రావడంతో ఆలయ అధికారులను వివరణ కోరగా, అసలు ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని అవుట్ పోస్ట్ సిబ్బందిని, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్‌ను ప్రశ్నించగా తమ దృష్టికి సైతం రాలేదని పేర్కొన్నారు. ఆలయ భద్రతా అంశాలపై ఇటీవల ఆక్టోపస్ సిబ్బంది చేసిన సూచనల్లో మల్లేశ్వరస్వామి ఆలయ భద్రతా అంశం కూడా ఉండటం, ఇప్పుడు ఈ ఘటన చోటు చేసుకోవడంతో భద్రతపై ఏం చేస్తారో చూడాలని భక్తులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



మాట్లాడుతున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జిల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్ స్థాయి నుంచి పార్టీ పదవుల నియామకాలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పాలనలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చామని వివరించారు. మానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు హామీలను అమలు చేయలేమని ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. పది నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్రంలో క్రైమ్‌రేట్ పెరిగిపోయిందని, లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, మహిళలకు రక్షణ లేదని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి గడప వద్దకే పాలన అందించారన్నారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ఏఐఎల్ఆర్ఎస్ఏ డిమాండ్



లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై మాట్లాడుతున్న రామకృష్ణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):భారతీయ రైల్వే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎల్ఆర్ఎస్ఏ (ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆరవ నెంబర్ ప్లాట్ ఫాంలోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ రైల్వేలోని లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై రైల్వేశాఖ మంత్రి మల్టీ డిసిప్లినరీ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తుందని ప్రకటించినట్లు తెలిపారు. కానీ నేటికీ లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రైల్వేబోర్డు, రైల్వేశాఖ తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా డ్యూటీ అవర్స్‌ను గూడ్స్‌లలో 8 గంటలు, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలని కోరారు. రాత్రి డ్యూటీలను రెండు రాత్రులకు పరిమితం చేయాలని, పీఆర్‌ను 30 గంటల నుంచి 40 గంటలకు పెంచాలని, 130 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లలో ట్రిప్ అలవెన్స్, కో–పైలట్‌లను నియమించాలని, మెమో, డెమో రైళ్లలో ఏఎల్‌పీలను నియమించాలని తెలిపారు. ఎఫ్ఎస్‌డి భారం నుంచి ఏఎల్‌పీకి విముక్తి కల్పించాలని, 30 గంటలలో హెడ్ క్వార్టర్స్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజనల్ అధ్యక్షుడు వెంకటేషన్, కార్యదర్శి ఆర్.వి. రాము, నాయకులు కె.రాజేష్, ఎ.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



మహమ్మద్ అఫ్రజ్ (951)



రెహమతున్నీసా (935)



కోమలి (987)



సాయి తనుష్ (466)



సీత శివ మల్లిక (466)



రక్షిత లియోన (431)



కె.యక్షిత, 989 మార్కులు



జి.రసజ్ఞ, 989 సీనియర్ ఇంటర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యాధరపురం కబేళా వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) విద్యార్థులు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హాఫీజ్ షేక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో మహమ్మద్ అఫ్రజ్ (బైపీసీ) 1000/951, షేక్ అఫ్ర రెహమతున్నీసా (బైపీసీ) 1000/935 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే సయ్యద్ మహబూబ్ హుస్సేన్ (సిఇసి) 919, గండికోట ప్రవీణ్‌కుమార్ (సిఇసి) 908 మార్కులు పొందారు. కాగా ఇంటర్ మొదటి సంవత్సరంలో బొడ్డేటి వంశిక (ఎంపీసీ) 470/427, కొప్పరాల లిఖిత (బైపీసీ) 421/440, షేక్ నస్రిన్ (సిఇసి) 427/500, షేక్ రజీన (సిఇసి) 418/500, మహమ్మద్ గౌసియ సుల్తాన (సిఇసి) 412/500 మార్కులు సాధించారని వివరించారు.

గొల్లపూడి ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో....

ఇంటర్ ఫలితాల్లో గొల్లపూడిలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని విజయవాడ జోనల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులయిన ఎం.శ్రీ సాయి తనుష్, ఆర్.సీత శివ మల్లిక 470 మార్క్‌లకుగాను 466, బైపీసీ విద్యార్థిని పి.రక్షిత లియోన 440 మార్క్‌లకుగాను 431 సాధించారని చెప్పారు. కాగా ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థిని బి.కోమలి 1000/987, బైపీసీ విద్యార్థిని జి.తేజశ్వని 1000/977 మార్క్‌లు పొందారని పేర్కొన్నారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం తరుపున ఏపీ అకడమిక్ డీన్ అరవింద్, విజయవాడ డీన్ శంకరరావు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం అభినందించారు. రమేష్ బాబు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఐ.ప్రజ్ఞ 466 మార్కులు, వి.శృతి–465, పీవీఎస్ఎస్.వర్షిణీ–465, ఎం.దేవహర్షిణి–465, జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను ఐ.నమ్రత–463, ఎం.కృష్ణప్రశాంత్–434 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు కె.యక్షిత, జి.రసజ్ఞ,–989 మార్కులు, వి.స్వీకృతాంజలి, బి.శ్రావణి–987, ఇ.యశస్విని–984 మార్కులు పొందారని చెప్పారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు, అధ్యాపకులు అభినందించారు.

■ పెనమలూరు: రోడ్డు భద్రతా నియమాలపై కానూరు కేసీపీ ఆదర్శ రెసిడెన్సియల్ విద్యార్థులు శనివారం విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకోవాలన్నారు.